ప్రగతి రథ చోదకాలు!

ఇండియన్ జాగ్రఫీ

ఒక దేశం వ్యవస్థాగతంగా, వేగంగా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల స్థాపన తప్పనిసరి. వనరుల వినియోగంతో పాటు ఉపాధి అవకాశాలను, ఆర్థిక పుష్టిని అందించే ప్రధాన రంగ మిది. ఒకప్పుడు ప్రపంచ కార్ఖానాగా వెలుగొందిన భారతదేశం వలస పాలనలో పారిశ్రా మికంగా మసకబారింది. స్వాతంత్ర్యానంతరం అమలుచేసిన పంచవర్ష ప్రణాళికలు ఆధునిక పారిశ్రామిక రంగానికి బాటలు వేశాయి. తొలుత యంత్ర, తయారీ ఆధారిత పరిశ్రమలు వృద్ధి చోదకాలుగా నిలిస్తే, నేడు విజ్ఞాన ఆధారిత పరిశ్రమలు కీలకంగా మారుతున్నాయి. ఈ పరిణామాలను పరీక్షార్థులు తెలుసుకోవాలి.

పరిశ్రమలు



భారతదేశం సహజ వనరుల నిలయం. ఆ వనరులను ముడి సరకు చేసి వినియోగ వస్తువులుగా మార్చేందుకు పరిశ్రమలు చాలా ముఖ్యం. వాటి స్థాపనకు ముడిసరకులతో పాటు మనిషి బుద్ధి నైపుణ్యం, ఇంధనం, కార్మికులు, మూలధనం, మార్కెట్, రవాణా సౌకర్యాలు అవసరం. వీటి లభ్యత భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, ఆర్థిక స్థితిగతులపై కూడా ఆధారపడి ఉంటుంది.

స్వాతంత్ర్యానికి పూర్వమే మన దేశం వస్త్ర పరిశ్రమ, ఉక్కు పరిశ్రమ, కుటీర పరిశ్రమలకు నిలయంగా ఉండేది. నేటి అభివృద్ధి చెందిన దేశాలకంటే ముందుగానే ఇక్కడ నాణ్యమైన వస్త్రాలు తయారయ్యేవి. దిల్లీలోని కుతుబ్‌మినార్ సమీపంలోని ఉక్కు స్తంభం 1500 ఏళ్ల క్రితం నాటి భారతీయుల నైపుణ్యాన్ని చాటుతోంది. చరిత్రలో డమాస్కస్‌లో వాడిన కత్తులను మన దేశంలోనే తయారు చేసినట్లు చెబుతారు. భారత్‌లో 1854లో మొదటి భారీ నూలు మిల్లు ముంబయి దగ్గర ప్రారంభమైంది. 1855లో కలకత్తా సమీపంలోని శ్రీరాంపూర్ వద్ద (రిష్రా) జనపనార మిల్లు, 1867లో కలకత్తా సమీపంలోని బాలీ వద్ద కాగితపు పరిశ్రమ, 1907లో జంషెడ్‌పుర్ వద్ద టాటా ఇనుము ఉక్కు పరిశ్రమ ప్రారంభమయ్యాయి.

స్వాతంత్ర్యానంతరం 1950 తర్వాత దేశంలో పారిశ్రామికాభివృద్ధి వేగవంతమైంది. రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో భారీ పరిశ్రమలు, నిత్యావసర వస్తువులు తయారుచేసే పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యమిచ్చారు. వీటిలో జౌళి పరిశ్రమ, లోహ తయారీ, ఇంజినీరింగ్, ఆహార ఉత్పత్తులు, రసాయనిక, ఇనుము ఉక్కు పరిశ్రమలు ముఖ్యమైనవి. మూడో పంచవర్ష ప్రణాళిక కాలంలో ప్రాథమిక పరిశ్రమలు, యంత్ర నిర్మాణ పరిశ్రమలకు; నాలుగో ప్రణాళిక కాలంలో ప్రభుత్వరంగ పరిశ్రమల అభివృద్ధికి, అయిదో ప్రణాళిక కాలంలో మౌలిక పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పించారు. ఆరో ప్రణాళిక కాలంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగానికి సమ ప్రాధాన్యం ఇవ్వగా, ఏడో ప్రణాళిక కాలంలో ఆహార పదార్థాల పరిశ్రమలపై (ఫుడ్ ప్రాసెసింగ్) ప్రధానంగా దృష్టిపెట్టారు. ఎనిమిదో ప్రణాళిక కాలంలో సరళీకృత ఆర్థిక విధానాలతో విదేశీ పెట్టుబడులు ఆహ్వానించి అన్నిరకాల పరిశ్రమలను ప్రోత్సహించారు. దీంతో ప్రైవేటు రంగంలో అభివృద్ధి వేగవంతమైంది. తొమ్మిదో ప్రణాళిక కాలంలో పారిశ్రామిక వృద్ధి రేటు తగ్గినప్పటికీ, 10వ ప్రణాళిక కాలంలో ఆ రంగం వృద్ధి 8%గా నమోదైంది. వస్తు తయారీ, ఆటోమొబైల్, మందుల పరిశ్రమల్లో గణనీయ వృద్ధి కనిపించింది. 11వ ప్రణాళిక కాలంలో ఈశాన్య రాష్ట్రాలకు, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము-కశ్మీర్‌లకు అభివృద్ధి ప్రోత్సాహకాలను ప్రకటించారు. 12వ ప్రణాళిక కాలంలో వ్యవసాయ, గ్రామీణ పరిశ్రమలు, సమూహ ఉత్పత్తుల తయారీ, నూలు, వస్త్ర పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం లభించింది.

పంచవర్ష ప్రణాళిక	సంవత్సరం	ప్రాధాన్యం
1	1951 – 56	వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం, అప్పటికే ఉన్న పరిశ్రమల అభివృద్ధికి తోడ్పాటు
2	1956 – 60	ప్రాథమిక, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం
3	1961 – 66	ప్రాథమిక, భారీ పరిశ్రమల విస్తరణ, అభివృద్ధి
వార్షిక ప్రణాళిక	1966 - 69	ఈ వార్షిక ప్రణాళికల కాలంలో పారిశ్రామిక వృద్ధి నామమాత్రం
4	1969 – 74	వ్యవసాయాధార పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం, వస్తూత్పత్తి, ఆటోమొబైల్ పరిశ్రమల అభివృద్ధి
5	1974 – 79	ఇనుము, ఉక్కు పరిశ్రమల స్థాపన, ఎగుమతి ఆధార పరిశ్రమల అభివృద్ధి
6	1980 – 85	దేశీయ, విదేశీ అవసరాలకు, మార్కెట్‌కు సరిపడే వస్తుఉత్పత్తి
7	1986 – 90	హైటెక్, ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించిన పరిశ్రమలు, స్వయం ఉపాధి, స్థానిక వనరుల వినియోగానికి ప్రాధాన్యం
వార్షిక ప్రణాళిక	1990 - 91	పారిశ్రామిక అభివృద్ధి అంతగా నమోదు కాలేదు
8	1992 – 97	నూతన పారిశ్రామిక విధానం, విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం
9	1997–2002	సాఫ్ట్‌వేర్ పరిశ్రమ అభివృద్ధి, సిమెంట్, బొగ్గు, చమురు, విద్యుత్తు వస్తువుల ఉత్పత్తి
10	2002–2007	ఆధునికీకరణ, సాంకేతిక అభివృద్ధి, ఉత్పత్తి వ్యయం తగ్గింపు, ఎగుమతుల పెంపు, ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్‌లు) ఏర్పాటు
11	2007–2012	సంతులిత అభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి అవసరమైన అంశాల గుర్తింపు
12	2012–2017	ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడే అంశాల గుర్తింపు

వర్గీకరణ

1) ముడి పదార్థాలపై ఆధారపడిన పరిశ్రమలు:

వ్యవసాయాధారిత పరిశ్రమలు: నూలు, పొగాకు, తేయాకు పరిశ్రమలు.

అటవీ ఆధారిత పరిశ్రమలు: అగ్గిపెట్టె, కాగితపు పరిశ్రమలు.

పశుపోషణ ఆధారిత పరిశ్రమలు: ఉన్ని వస్త్రాలు, తోళ్ల శుద్ధి, మాంసం శుద్ధి పరిశ్రమ.

ఖనిజాధారిత పరిశ్రమలు: ఇనుము-ఉక్కు, చమురుశుద్ధి, రసాయన ఎరువులు.

సముద్ర ఆధారిత పరిశ్రమలు: ఉప్పు తయారీ, కాడ్ లివర్ ఆయిల్ పరిశ్రమ, మత్స్య పరిశ్రమ.

2) వ్యవస్థీకృత/ యాజమాన్యం ఆధారంగా వర్గీకరణ:

ప్రభుత్వ రంగం: ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించేవి.

ప్రైవేట్ రంగం: ప్రైవేటు వ్యక్తులు లేదా వ్యక్తుల సమూహంతో నిర్వహించేవి.

ఉమ్మడి రంగం: ప్రభుత్వ ప్రైవేటు రంగం సంయుక్తంగా నిర్వహించేవి.

సహకార రంగం: ఒకరికొకరు సహకరించుకునే విధానం.

3) ఉత్పాదకతల ఆధారంగా వర్గీకరణ:

మౌలిక పరిశ్రమలు: ఇవి ఇతర పరిశ్రమల స్థాపనకు దోహదపడతాయి.
ఉదా: ఇనుము-ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగం

వినియోగ వస్తు పరిశ్రమలు: వినియోగదారుడు నేరుగా ఉపయోగించేవి.
ఉదా: సబ్బు, కాగితం, షాంపూలు, చక్కెర

4) వార్షిక టర్నోవర్, పెట్టుబడి ఆధారంగా వర్గీకరణ:

మెగా ప్రాజెక్టులు: రూ.500 కోట్లు, ఆపైన మూల ధనం వ్యయం; 1000, అంతకుమించి ఉద్యోగులున్న ప్రాజెక్టు.

భారీ పరిశ్రమలు: రూ.200 కోట్ల వ్యయం, 200 మందికి ఉపాధి కల్పించేవి.

మధ్యతరహా పరిశ్రమలు: రూ.50 కోట్ల కంటే ఎక్కువ వ్యయం, వార్షిక టర్నోవర్ రూ.250 కోట్లు ఉన్న పరిశ్రమలు

చిన్న పరిశ్రమలు: రూ.10 కోట్ల పెట్టుబడి, వార్షికంగా రూ.50 కోట్ల టర్నోవర్ ఉన్న పరిశ్రమలు.

సూక్ష్మ పరిశ్రమలు: రూ.కోటి పైగా పెట్టుబడి, వార్షిక టర్నోవర్ రూ.5 కోట్లలోపు ఉన్న పరిశ్రమలు.

కుటీర పరిశ్రమలు: నామమాత్ర పెట్టుబడితో కుటుంబ సభ్యులు పూర్తిగా/ పాక్షికంగా నిర్వహించే పరిశ్రమలు.

- శ్రామికులు ఎక్కువగా అవసరం ఉండే పరిశ్రమలను శ్రమ ఆధారిత పరిశ్రమ అంటారు. **ఉదా:** నూలు వస్త్ర పరిశ్రమ.
- అధిక మొత్తంలో పెట్టుబడులు అవసరమయ్యే పరిశ్రమలను పెట్టుబడి ఆధారిత పరిశ్రమలు అంటారు. **ఉదా:** ఇనుము, ఉక్కు పరిశ్రమలు.
- ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగ పరిశ్రమలను విజ్ఞాన ఆధారిత పరిశ్రమలు అంటారు.
- స్థిర ముడి పదార్థాలు, ఆధునిక పరిజ్ఞానం, అధిక పెట్టుబడితో నడిచే పరిశ్రమలను ఫుట్‌లూస్ పరిశ్రమలు అంటారు. **ఉదా:** వజ్రాలు, ఆభరణాల పరిశ్రమలు.
- నిరంతరాయంగా ముడి పదార్థాలు అవసరమయ్యే పరిశ్రమలను నాన్ ఫుట్‌లూస్ పరిశ్రమలు అంటారు.





2021-22 ఆర్థిక సర్వే ప్రకారం ప్రధాన పరిశ్రమలుగా గుర్తించినవి.

1) బొగ్గు 2) సహజ వాయువు 3) ముడిచమురు 4) రిఫైనరీ ఉత్పత్తులు 5) ఎరువులు 6) స్టీల్ (ఉక్కు) 7) విద్యుత్ 8) సిమెంట్

- 2021–22 సర్వే ప్రకారం అత్యధిక పరిశ్రమలున్న రాష్ట్రాలు: 1) తమిళనాడు 2) మహారాష్ట్ర 3) గుజరాత్.
- భవిష్యత్తులో కొత్తగా, అత్యధికంగా, వేగంగా అభివృద్ధి చెందే పరిశ్రమలను 'సన్‌రైజ్ పరిశ్రమలు' అంటారు.

ఉదా: హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తి, పెట్రో కెమికల్, ఫుడ్ ప్రాసెసింగ్, అంతరిక్ష పర్యాటకం.

రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్

- 2023, జనవరి 16 నుంచి 20 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో భారత్ నుంచి పాల్గొన్న ఇద్దరు యువ పర్యావరణవేత్తలు ఎవరు?
  జ: కరణ్‌కుమార్, కె.గాయత్రి రెడ్డి
- ఒక్కసారి వాడి పారవేసే ప్లాస్టిక్ సంచుల తయారీ, వినియోగంపై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధం దేశవ్యాప్తంగా ఏ రోజు నుంచి అమల్లోకి వచ్చింది? (ఇకపై దేశవ్యాప్తంగా 120 మైక్రాన్‌లు లేదా ఆపై మందం గల ప్లాస్టిక్ సంచులను మాత్రమే వినియోగించాలి. ఇప్పటి వరకు 75 మైక్రాన్‌ల మందం గల క్యారీ బ్యాగులను వినియోగించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది)
  జ: 2022, డిసెంబరు 31
- అంతరిక్షంలో షూటింగ్ జరిపిన తొలి చిత్రంగా ఏ దేశానికి చెందిన 'ది ఛాలెంజ్' సినిమా రికార్డు సృష్టించింది? (ఈ చిత్ర దర్శకుడు క్లిమ్ షెపెంకో)
  జ: రష్యా
- రాబోయే మూడేళ్లలో భారత్ సార్క్ కంపెనీ నుంచి 155 ఎంఎం హోవిట్జర్ శతఘ్నులను కొనుగోలు చేయడానికి ఏ దేశం రూ.1200 కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది? (2020లో అజర్‌బైజాన్‌కు, ఈ దేశానికి మధ్య పోరాటం సాగుతున్నప్పుడు భారత్ స్వాతి రాడార్‌లను ఈ దేశానికి విక్రయించింది. శత్రు దేశ ఫిరంగులు, ఇతర ఆయుధాలు ఎక్కడ ఉన్నాయో స్వాతి రాడార్‌లు కనిపెట్టగలవు)
  జ: ఆర్మేనియా

ఈ-బుక్స్

టీఎస్‌పీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు

వీడియో పాఠం

అరిథ్‌మెటిక్ సగటు

పన్ను విధానం కొత్తదా? పాతదా? ఏది మేలు?

పన్ను గణన సంక్లిష్టమైన వ్యవహారమే. మీ వయసు, ఎంత సంపాదిస్తారు, పొదుపు, పెట్టుబడులు, ఖర్చులు ఇలా అనేక అంశాలపై ఆధారపడి దీన్ని లెక్కించాల్సి ఉంటుంది. చాలామంది పన్ను చెల్లింపుదారులు తాము ఆర్జించే ఆదాయంపై పన్ను ఎంత పడుతుంది, తగ్గించుకునేందుకు ఏం చేయాలి? అని చూస్తుంటారు. సులభంగా పన్నును లెక్కించేందుకు ఉన్న మార్గాలను స్వాగతిస్తుంటారు. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన కొత్త పన్నుల విధానంలో మార్పులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. పాత, కొత్త పన్నుల విధానాల్లో దేన్ని ఎంచుకుంటే భారం తగ్గుతుందన్నది తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

ఆదాయపు పన్నుల విధానాన్ని సరళీకృతం చేసే దిశగా గత కొన్నేళ్లుగా ఎన్నో మార్పులు జరుగుతూనే ఉన్నాయి. ఆదాయపు పన్ను శ్లాబులను సవరించడం, మినహాయింపుల పరిమితిని పెంచడం, కొత్త సెక్షన్లను తీసుకురావడంలాంటివి గతంలో ఉండేవి. 2020-21 బడ్జెట్‌లో ప్రతిపాదించిన కొత్త పన్ను విధానంలో ఎలాంటి మినహాయింపులతో పనిలేకుండా వచ్చిన ఆదాయానికి వర్తించే శ్లాబుల ప్రకారం నేరుగా పన్ను చెల్లించే వీలును తీసుకొచ్చారు. పాత పన్ను విధానం-కొత్త పన్ను విధానంలో కావాల్సింది ఎంచుకునే వీలుంది. కానీ, చాలామందికి సెక్షన్ 80సీలో రూ.1,50,000, ఇంటి రుణం వడ్డీ రూ.2,00,000, సెక్షన్ 80డీ కింద రూ.25,000, విద్యా రుణం వడ్డీ చెల్లింపు, ఎన్‌పీఎస్‌లాంటివి ఉండటంతో కొత్త పన్ను విధానంతో పోలిస్తే మినహాయింపులను క్లెయిం చేసుకునేందుకు వీలున్న పాత పన్ను విధానం వైపే మొగ్గు చూపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రిటర్నులు దాఖలు చేసిన వారిలో 1 శాతంలోపే కొత్త పన్ను విధానాన్ని ఎంచుకున్నారు. కొత్తగా పన్ను పరిధిలోకి వచ్చే వారు, పెట్టుబడులు పెట్టలేని వారు దీన్నే ఎంచుకునేలా ప్రభుత్వం తాజా ప్రతిపాదనలు చేసింది. పైగా దీన్ని 'డిఫాల్ట్'గా మార్చింది. అయినా ఇష్టమైనది ఎంచుకునే వీలుంది.

నెలకు రూ.62,500 వచ్చినా... ✦✦✦

ప్రతిపాదిత కొత్త పన్ను విధానంలో ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 115బీఏసీ ప్రకారం రూ.7లక్షల వరకూ ఎలాంటి పన్నూ వర్తించదు. రూ.50వేల ప్రామాణిక తగ్గింపునూ దీనికి వర్తింపచేశారు. దీంతో మొత్తం ఆదాయం రూ.7,50,000 వరకూ ఉన్నవారు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అంటే నెలకు రూ.62,500 వరకూ వేతనం ఆర్జించే వారందరూ పన్ను నుంచి మినహాయింపు పొందినట్లే. పదేళ్ల క్రితం ఈ ఆదాయానికి రూ.82,400 పన్ను చెల్లించాల్సి వచ్చేది. కొత్త పన్ను విధానంలో శ్లాబుల సంఖ్యనూ తగ్గించడం ఇక్కడ గమనార్హం. రూ.15లక్షల ఆదాయం మించిన వారికి 30 శాతం పన్ను శ్లాబును కొనసాగించారు.

మారాల్సిందేనా? ✦✦✦

పన్ను చెల్లింపుదారులు తక్కువ నిబంధనలు, తక్కువ పన్ను ఉండే విధానానికే ఎక్కువగా మొగ్గు చూపిస్తారు. మినహాయింపులు అధికంగా ఉన్న వారు పాత పన్ను విధానాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నారు. తక్కువ మినహాయింపులు ఉన్నవారికి అధిక ప్రయోజనాలు కల్పించే విధంగా కొత్త పన్ను విధానం ఉంది. కొత్త, పాత పన్ను విధానాన్ని పోల్చి చూసి, తక్కువ పన్ను భారం పడే విధానాన్ని ఎంచుకోవచ్చు. కొంతమందికి పాత పద్ధతే ప్రయోజనం చేకూర్చవచ్చు. ఇది పూర్తిగా వారికి ఉన్న పలు పన్ను ఆదా పెట్టుబడులు, గృహ, విద్యా రుణం వడ్డీ చెల్లింపులపై ఆధారపడి ఉంటుంది.

10 ఏళ్ల నుంచీ... ✦✦✦

ప్రస్తుతం అమల్లో ఉన్న పాత పన్ను విధానం శ్లాబులను 2013లో నిర్ణయించారు. అంటే దాదాపు 10 ఏళ్ల క్రితం. అప్పటి నుంచి పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో పాటు సర్దుబాటు చేయని శ్లాబుల్లోనే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను వర్తించే ఆదాయం రూ.5 లక్షలకు మించి ఆదాయం ఉంటే 20 శాతం, రూ.10 లక్షలకు మించినప్పుడు 30 శాతం వరకూ పన్ను చెల్లించాలి. కాబట్టి, ఏ విధానంలో గణించాలన్నది ఒకసారి పూర్తిగా లెక్కించుకోవాలి. ఆదాయపు పన్ను శాఖ తన పోర్టల్‌లో దీనికోసం ప్రత్యేకంగా కాలిక్యులేటర్‌నూ అందిస్తోంది. దీన్ని ఉపయోగించుకొని తగిన నిర్ణయం తీసుకోండి.

ఒక్కమాటలో.. ✦✦✦

వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే.. 2023-24లో మీ మొత్తం ఆదాయం రూ.7.5 లక్షల లోపు ఉంటే... ఎలాంటి ఆలోచన లేకుండా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకోండి. మినహాయింపుల కోసం పొదుపు, పెట్టుబడి ఆధారాలను చూపించాల్సిన అవసరం లేదు.

- రూ.10 లక్షల ఆదాయం ఉండి, రూ.3 లక్షల వరకూ వివిధ మినహాయింపులు ఉన్న వారికి పాత పన్ను విధానంలో రూ.54,600 వరకూ పన్ను పడుతుంది. ప్రతిపాదిత కొత్త పన్ను విధానంలోనూ రూ.54,600 పన్ను పడుతుంది.

తేడా ఉంది.. ✦✦✦

మొత్తం ఆదాయం అంటే ఒక ఆర్థిక సంవత్సరంలో మీరు ఆర్జించిన వేతనం, డివిడెండ్లు, వడ్డీ, అద్దె తదితర అన్ని ఆదాయాలనూ కలిపితే వచ్చేది. దీన్నే స్థూల ఆదాయంగానూ పిలుస్తారు. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం పలు సెక్షన్ల కింద మినహాయింపులు పోను మిగిలిన మొత్తం పన్ను వర్తించే ఆదాయంగా లెక్కిస్తారు. దీనిపైనే శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తారు.

- అధిల్ శెట్టి, సీఈఓ, బ్యాంక్‌బజార్

పట్టికను పరిశీలిస్తే.. పాత పన్ను విధానం, ప్రస్తుతం అమల్లో ఉన్న కొత్త పన్ను విధానం, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రాబోతున్న కొత్త పన్ను విధానంలో పలు ఆదాయ వర్గాల వారికి పన్ను భారం ఎలా ఉంటుందన్నది అర్థం చేసుకోవచ్చు. పాత పన్ను విధానంలో స్థూల ఆదాయంలో వివిధ సెక్షన్ల కింద గరిష్ఠంగా 30 శాతం మేరకు పన్ను మినహాయింపుల కోసం పొదుపు, పెట్టుబడులు పెట్టారన్న అంచనాతో పన్ను గణన జరిగింది. (ఒకవేళ 20 శాతం మేరకే పన్ను మినహాయింపు పెట్టుబడులు పెట్టారనుకుంటే.. కొత్త విధానంలో మిగులు కనిపించే అవకాశం ఉంది.)

పాత పన్ను విధానం			కొత్త పన్ను విధానం (అమల్లో ఉన్నది)		ప్రతిపాదిత కొత్త పన్ను విధానం (2023-24)			ప్రతిపాదిత కొత్త విధానంతో పోలిస్తే పాత విధానంలో మిగులు (సి–ఏ)
మొత్తం ఆదాయం	30 శాతం మినహాయింపుతో పన్ను వర్తించే ఆదాయం రూ.	పన్ను రూ. (ఏ)	మొత్తం ఆదాయం	పన్ను రూ.	మొత్తం ఆదాయం	ప్రామాణిక తగ్గింపు రూ.50వేల తర్వాత రూ.	పన్ను (సి)	
5,00,000	3,50,000	0	5,00,000	0	5,00,000	4,50,000	0	0
6,00,000	4,20,000	0	6,00,000	23,400	6,00,000	5,50,000	0	0
7,00,000	4,90,000	0	7,00,000	33,800	7,00,000	6,50,000	0	0
8,00,000	5,60,000	25,480	8,00,000	46,800	8,00,000	7,50,000	31,200	5,720
9,00,000	6,30,000	40,040	9,00,000	62,400	9,00,000	8,50,000	41,600	1,560
10,00,000	7,00,000	54,600	10,00,000	78,000	10,00,000	9,50,000	54,600	0
11,00,000	7,70,000	69,160	11,00,000	98,800	11,00,000	10,50,000	70,200	1,040
12,00,000	8,40,000	83,720	12,00,000	1,19,600	12,00,000	11,50,000	85,800	2,080
15,00,000	10,50,000	1,32,600	15,00,000	1,95,000	15,00,000	14,50,000	1,45,600	13,000
17,50,000	12,25,000	1,87,200	17,50,000	2,73,000	17,50,000	17,00,000	2,18,400	31,200
20,00,000	14,00,000	2,41,800	20,00,000	3,51,000	20,00,000	19,50,000	2,96,400	54,600

వైద్య పాలసీ రూ.5 కోట్ల వరకూ

పాలసీదారుడు తనకు ఇష్టం ఉన్నట్లుగా పాలసీని తీసుకునే వీలు కల్పిస్తూ వినూత్న ఆరోగ్య బీమా పథకాన్ని **బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ మై హెల్త్‌కేర్ ప్లాన్'** పేరుతో తీసుకొచ్చింది. ఓపీడీ సేవలకూ చెల్లించిన ప్రీమియానికి రెండు రెట్ల వరకూ పరిహారం ఇవ్వడం దీని ప్రత్యేకత. కనీసం రూ.3 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.5 కోట్ల వరకూ పాలసీని ఎంచుకోవచ్చు. విదేశాల్లో ఉన్నప్పుడూ బీమా రక్షణ పర్తించేలా ఇంటర్నేషనల్ కవర్‌ను తీసుకునే వీలుంది. ప్రసూతి ఖర్చులు, నవజాత శిశువులకు తొలి రోజు నుంచే వర్తించడంలాంటివి ఈ పాలసీలో భాగంగా ఉన్నాయి. వ్యక్తిగతంగానూ, ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీని తీసుకోవచ్చు. ఏడాది, రెండు, మూడేళ్ల వ్యవధికి పాలసీని తీసుకోవచ్చు. ప్రీమియాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించే అవకాశం ఉంది. 45 ఏళ్లలోపు వారు పాలసీ తీసుకునేందుకు ఎలాంటి వైద్య పరీక్షలు అవసరం లేదు. ముందస్తు వ్యాధులకు 36 నెలల వేచి ఉండే వ్యవధి వర్తిస్తుంది. లాస్ ఆఫ్ ఇన్‌కం కవర్, మేజర్ ఇల్‌నెస్ కవర్లలాంటివి విడిగా తీసుకోవచ్చు. క్లెయిం చేయని ఏడాదిలో 50 శాతం బోనస్ లభిస్తుంది.

మార్కెట్ పరిస్థితులకు తగ్గట్టుగా..

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా యాక్సిస్ బిజినెస్ సైకిల్స్ ఫండ్ పేరుతో కొత్త మ్యూచువల్ ఫండ్ పథకాన్ని తీసుకువచ్చింది. దీని ఎన్‌ఎఫ్‌ఓ ముగింపు తేదీ ఈ నెల 16. ఇది ఓపెన్ ఎండెడ్, థీమ్యాటిక్ పథకం. కనీస పెట్టుబడి రూ.5,000. యాక్సిస్ బిజినెస్ సైకిల్స్ ఫండ్‌కు ఆశిష్ నాయక్ ఫండ్ మేనేజర్. ఈ పథకం పనితీరును 'నిఫ్టీ 500 టీఆర్ఐ ఇండెక్స్'తో పోల్చి చూస్తారు.

ఒక్కోసారి ఒక్కో వ్యాపార రంగం వెలుగులో ఉంటుంది. మెరుగైన పనితీరు ప్రదర్శిస్తుంది. ఆ తర్వాత కొంతకాలానికి ఆ రంగం పక్కకు వెళ్లిపోయి మరొక రంగం తెరమీదకు వస్తుంది. ఇలా వ్యాపార రంగాలు మారిపోతూ ఉండటం 'బిజినెస్ సైకిల్స్' అని వ్యవహరిస్తూ ఉంటారు. ఇలా వెలుగులోకి వచ్చే రంగాల్లోని కంపెనీలను ముందుగానే గుర్తించి, పెట్టుబడి పెట్టి అధిక లాభాలు ఆర్జించే పథకాలే బిజినెస్ సైకిల్స్ ఫండ్స్. యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ఆవిష్కరించిన పథకం ఈ కోవలోనిదే. మారుతున్న వ్యాపార పరిస్థితులకు అనుగుణంగా ఫండ్ మేనేజర్, ఈ పథకం పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను మారుస్తుంటారు. 'టాప్ డౌన్', 'బాటమ్ అప్' పద్ధతిని అనుసరిస్తూ పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తారు. బిజినెస్ సైకిల్స్ పథకాలు తక్కువ సమయంలో అధిక ప్రతిఫలాన్ని ఆర్జించే అవకాశం లేదు. ఆ మాటకొస్తే ఎటువంటి పెట్టుబడి అయినా తగిన ప్రతిఫలాన్ని ఇవ్వటానికి సమయం పడుతుంది. అందువల్ల దీర్ఘకాలం ఎదురుచూసే వారికి ఇలాంటి పథకాలు అనువుగా ఉంటాయి.

కొత్త పథకం

అన్ని తరగతుల షేర్లలో..

**ఐటీఐ మ్యూచువల్ ఫండ్ ఒక ఫ్లెక్సీ క్యాప్ పథకాన్ని ఆవిష్కరించింది. ఈ ఐటీఐ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ముగింపు తేదీ ఈ నెల 10. ఈ ఓపెన్ ఎండెడ్ పథకంలో కనీస పెట్టుబడి రూ.5,000. నిఫ్టీ 500 టీఆర్ఐ సూచీతో ఈ పథకం పనితీరును పోలుస్తారు. పేరులోనే ఉన్నట్లు ఏదో ఒక మార్కెట్ క్యాప్ షేర్లకే పరిమితం కాకుండా, అన్నింటిలోనూ పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. అంటే లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన షేర్లలో మదుపు చేయడం ద్వారా పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తారు. ధీమంత్ షా, రోహన్ కోర్డే, తనయ్ గభవాలా ఈ పథకానికి ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు.